

లారీ ఢీకొని ఇద్దరు దుర్మరణం

లారీ, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందారు. తెలంగాణ రాష్ట్రం కీసరలో జరిగిన ఈ ఘటనలో మృతులు హెచ్ఎంపాడు మండలానికి చెందినవారు.

- 8లో..



నిద్రలోనే అనంత లోకాలకు..

తెలంగాణ రాష్ట్రం నల్గొండ వద్ద ట్రావెల్స్ బస్సు దగ్ధమైన ఘటనలో మృతుడు ఒంగోలు వాసిగా గుర్తించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
25.1/23.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తీరం దాటినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

ఒంగోలు: తుఫాన్ తీరం దాటినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రమాదకరంగా ఉన్న భవనాల్లో ఉండరాదన్నారు. సురక్షితమైన ప్రాంతాల్లో నివాసం ఉండాలని, ఎవరికి ఏ అవసరం వచ్చినా తక్షణమే ఆదుకునేందుకు ప్రభుత్వంతోపాటు వైఎస్సార్ సీపీ శ్రేణులు నిత్యం అందుబాటులో ఉంటాయని భరోసా ఇచ్చారు. ఎవరూ ఎటువంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని చెప్పారు. ఒక వైపు జరిగిన నష్టంపై కూడా ప్రభుత్వం జిల్లా యంత్రాంగం ద్వారా నష్ట అంచనాలు తెలుసుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే పలుమార్లు కలెక్టర్లతో సమీక్షించారన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి

ఒంగోలు: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ కటారి శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, ముఖ్య అతిథిగా నగర మేయర్ గంగాడ సుజాత హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ఐఓసీ డిపోను కొనసాగించాలి



ఒంగోలు: ఒంగోలు-సూరారెడ్డిపాలెం మధ్య ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డిపోను కొనసాగించాలని కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ కార్యదర్శి పంకజ్ జైన్‌ను కలిసి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ డిపో నుంచి నిత్యం చిత్తూరు, కడప, గుంతకల్లు, కొండపల్లి, వైజాగ్, చెన్నై డిపోలకు ఆయిల్ సరఫరా జరుగుతోందన్నారు. ఈ ట్యాంకర్లకు సంబంధించిన 250 కుటుంబాలకు చెందిన 2 వేలమంది, దీనికి అనుబంధంగా ఇతర కుటుంబాలు ఈ డిపో మీద ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు. ఈ మధ్య ఈ డిపోను మూసివేస్తున్నారని ప్రచారం వినవస్తోందని, ఈ డిపోను కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ట్యాంకర్ల వర్కర్ల యూనియన్ వారు కోరుతున్నారని, వేలాది కుటుంబాల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని డిపోను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించి డిపోను కొనసాగించేందుకు తప్పక కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

భైరవకోనలో ఉధృతంగా జలపాతం



సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రం భైరవకోన ఎగువ ప్రాంతంలో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు జలపాతానికి వర్షపు నీరు పోటెత్తింది. దీంతో జలపాతం నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తూ కన్నుల పండుగ చేస్తోంది. జలపాతం నుంచి జాలువారుతున్న నీటి సవ్వడులతో, ప్రకృతి శోభాయమానంతో ఉంది. జలపాతం వద్ద ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు కలగకుండా ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి, ఈవో నర్రా నారాయణరెడ్డి ప్రత్యేక భద్రతా చర్యలు చేపడుతున్నారు.

మూడో సెమిస్టర్ పరీక్ష వాయిదా

ఒంగోలు: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ రెండో సంవత్సరం మూడో సెమిస్టర్ బుధవారం జరగాల్సిన పరీక్షను వాయిదా వేసినట్లు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ అదనపు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రెడ్డి ప్రకాష్ మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుఫాన్ పరిస్థితుల కారణంగా పరీక్ష వాయిదా వేశారని, పరీక్షను మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు.



జరుగుమల్లిలో నీటమునిగిన పొలాలు



ఒంగోలు మంగమూరురోడ్డు సత్యసాయిస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో భోజనం చేస్తున్న ప్రజలు

మిచాంగ్ గజ గజ..

మిచాంగ్ తుఫాన్ జిల్లాను గజగజలాడించింది. తీవ్ర చలిగాలులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. తీర ప్రాంత మండలాల ప్రజలు అవస్థలు పడ్డారు. పాకల పల్లెపాలెంలో సముద్రం సుమారు 50 అడుగులు ముందుకొచ్చింది. భారీ వర్షాలతో 20 వేల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 900 హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. కొన్ని మండలాల్లో పంట పొలాలు చెరువులను తలపించాయి. ఈదురు గాలులతో పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ప్రధానంగా ఒంగోలు డివిజన్‌లో విద్యుత్ వ్యవస్థ దెబ్బతింది. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అధికార యంత్రాంగం సహాయక చర్యలు ముమ్మరం చేసింది. విద్యుత్‌శాఖ అధికారులు యుద్ధప్రాదిపతికన మరమ్మతులు చేసి కరెంటు సరఫరాను పునరుద్ధరించారు. పంట పొలాల్లో వ్యవసాయశాఖ అధికారులు పర్యటించి నష్టాన్ని అంచనా వేస్తూనే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మంగళవారం మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా ప్రత్యేకాధికారి ప్రద్యుమ్న అధికారులతో సమావేశమయ్యారు. పునరావాస కేంద్రాల్లో బాధితులను పరామర్శించారు. వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులతో పాటు ఆహారాన్ని అందించారు. తుఫాన్ తీరం దాటడటంతో అధికారులతో పాటు జిల్లా వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

- జిల్లాలో మూడు రోజులుగా భారీ వర్షాలు, ఈదురు గాలులు
- పలు ప్రాంతాల్లో కూలిన విద్యుత్ స్తంభాలు, వృక్షాలు
- తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- నీటమునిగిన పంట పొలాలు
- ఒంగోలు నగరాన్ని ముంచెత్తిన భారీ వర్షాలు
- జిల్లాలో 47 పునరావాస కేంద్రాల ఏర్పాటు
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రత్యేకాధికారి ప్రద్యుమ్న
- సహాయక చర్యలపై అధికారులతో సమీక్ష
- తీరం దాటడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు



కొత్తపట్నం సముద్రతీరంలో పరిస్థితి పరిశీలిస్తున్న జిల్లా తుఫాన్ స్పెషల్ ఆఫీసర్ ప్రద్యుమ్న, కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్

సాక్షిప్రతినిధి, ఒంగోలు: మిచాంగ్ తుఫాన్‌తో జిల్లా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. మూడు రోజులుగా తీవ్ర చలిగాలులు, ఈదురుగాలులతో భారీ వర్షాలు కురిశాయి. సింగరాయకొండ మండలం పాకల పల్లెపాలెంలో సముద్రం సుమారు 50 అడుగులు ముందుకొచ్చింది. ఊళ్లపాలెం, పాకల పంచాయతీ చెల్లెమ్మగారి పట్టపుపాలెం సముద్రతీరంలో అలల ఉధృతితో బోట్లు ఒకదానికొకటి గుద్దుకుని పాక్షికంగా దెబ్బతిన్నాయని మత్స్యకారులు తెలిపారు. విషయం తెలుసుకున్న మత్స్యకారులు తమ బోట్లను ట్రాక్టర్ల సహకారంతో సురక్షితమైన చోట ఉంచుకున్నారు. పాకల, ఊళ్లపాలెం తీరప్రాంత గ్రామాలను సీఐ దాచేపల్లి రంగనాథ్ పర్యవేక్షించారు. కొత్తపట్నం తీరంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. రాకాసి అలలు ఎగసిపడడంతో సముద్రం ముందుకొచ్చింది. నీళ్లు రోడ్డున తాకడంతో బోట్లు, వలలు దెబ్బతినే పరిస్థితి నెలకొని ఉంది. తీరం వెంబడి పలు ప్రాంతాల్లో కోతకు గురైంది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే అపమత్తమైంది. జిల్లా యంత్రాంగం తక్షణం స్పందించింది. జిల్లా వ్యాప్తంగా 47 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒక్క ఒంగోలు నగరంలోనే 16 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. మిగతా 31 పునరావాస కేంద్రాలు సింగరాయకొండ, టంగుటూరు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు మండలాల్లో ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రాల్లో పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించింది. తీర ప్రాంతాల ప్రజలతో పాటు, ఒంగోలు నగరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించింది. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ పునరావాస కేంద్రాల పర్యవేక్షణ చేపట్టారు. ప్రధానంగా సముద్ర తీర ప్రాంత గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. సముద్రంలో వేటకు వెళ్లకుండా నిరోధించారు. అధికారులు ముందస్తుగా తీసుకున్న జాగ్రత్తలతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. మంగళవారం మధ్యాహ్నం బాపట్ల వద్ద తీరం దాటడంతో అధికారులతో పాటు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

తుఫాన్ ప్రభావం జిల్లాలో సోమవారం ఒక మోస్తరుగా ఉన్నా.. మంగళవారం మాత్రం బలమైన ఈదురు గాలులు వీచటంతో విద్యుత్ వ్యవస్థకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. ఒంగోలు విద్యుత్ డివిజన్‌లో తీవ్రంగా నష్టం వాటిల్లింది. ఆ తరువాత స్థానంలో దర్శి విద్యుత్ సబ్ డివిజన్‌లో విద్యుత్ స్తంభాలు కూలిపోవటం, విద్యుత్ తీగలు తెగిపోవటం లాంటి నష్టాలు సంభవించాయి. జిల్లాలో అనేకచోట్ల చెట్లు పడిపోవటంతో పాటు అవి కరెంట్ స్తంభాల మీద పడి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో చెట్లు రోడ్ల మీద పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఒంగోలు నగరంలో కొన్ని ప్రాంతాల్లో రెండు రోజులుగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఒంగోలు, దర్శి విద్యుత్ డివిజన్లలో భారీగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఒక వైపు తీవ్ర గాలులు, మరో వైపు భారీ వర్షం కురుస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మరమ్మతుల పనులు చేపట్టారు. విద్యుత్ అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో వెంటనే పునరుద్ధరించే కార్యక్రమాన్ని వేగంగా చేశారు.

- భారీ వర్షాలకు 20 వేల హెక్టార్లకు పైగా వ్యవసాయ పంటలు నీట మునిగాయి. అదేవిధంగా ఉద్యాన పంటలు కూడా దాదాపు 900 హెక్టార్లకు పైగా దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనాలు వేస్తున్నారు.
- జిల్లాలోని పునరావాస కేంద్రాలను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పరిశీలించారు. జిల్లా ప్రత్యేకాధికారి, సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రద్యుమ్న మంగళవారం జిల్లాకు వచ్చారు. మంత్రి ఆదిమూలపు సురేష్‌తో పాటు ఒంగోలులోని పలు పునరావాస కేంద్రాలను పరిశీలించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్, ఎస్పీ మలిక గర్గ్ కూడా మంత్రి, స్పెషలాఫీసర్ వెంట పర్యటించారు.
- ఉద్యాన పంటలు కూడా దాదాపు 900 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు జిల్లా ఉద్యాన శాఖాధికారి గోపీచంద్ ప్రాథమిక అంచనాలు రూపొందించారు. ప్రధానంగా మిర్చి పంట 300 హెక్టార్లలో, చేమ, కంద, అరటితో పాటు కూరగాయల తోటలు కలిపి మరో 600 హెక్టార్లలో దెబ్బతిన్నట్టు గుర్తించారు.
- జిల్లాలో పలు ప్రాంతాల్లో చెట్లు రోడ్డుకు అడ్డంగా పడిపోవటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దర్శి-అద్దంకి రహదారిలో రెడ్డినగర్, పెద్ద ఉల్లగల్లు గ్రామాల వద్ద చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.



చప్టాపై పొంగి ప్రవహిస్తున్న కొత్తకోట వాగు



ఒంగోలు పులివెంకటరెడ్డి కాలనీలో ఆహారం అందిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి, మేయర్ గంగాడ



ఒంగోలు బాలినేని శ్రీనివాస్ కాలనీలో నిలిచిన వర్షం నీటిని బయటకు పంపేలా కాలువ తీస్తున్న పొక్లెయిన్



సింగరాయకొండ మండలం పాకల తీరంలో ఎగసిపడుతున్న అలలు



బద్వీడులో వర్షానికి నేలవాలిన జొన్న పంట



ముండ్లమూరు మండలంలో వర్షానికి నేలవాలిన వరి



ఒంగోలు రామ్‌నగర్ 4వ లైన్‌లో కూలిన చెట్టు

జిల్లాలో 32.3 మి.మీ సగటు వర్షపాతం నమోదు

ఒంగోలు సెంట్రల్: జిల్లా అంతటా మంగళవారం విస్తృతంగా వర్షాలు కురిశాయి. జిల్లాలో 32.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా దర్శిలో 140.4 మి.మీలు, అత్యల్పం సీఎస్ పురంలో 8.6 మి.మీలుగా నమోదైంది. మంగళవారం ఉదయం 8.30 నుంచి రాత్రి 9 గంటల వరకు కురిసిన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి... ముండ్లమూరు 79.2, తాళ్లూరు 76.2, పొదిలి 67.6, దొనకొండ 63.8, త్రిపురాంతకం 56, కురిచేడు 50.2, చీమకుర్తి 43.2, జరుగుమల్లి 43.2, మర్రిపూడి 42, కె.కే మిట్ల 33.8, ఒంగోలు 32.6, కొండపి 32.5, మద్దిపాడు 32.4, మార్కాపురం 30.8, పుల్లలచెరువు 30.2, పొన్నలూరు 28, తర్లుపాడు 25.2, హెచ్ఎంపాడు 23.2, ఎస్ఎన్ పాడు 22, ఎస్ కొండ 20, వై పాలెం 18.7, పామూరు 18.4, కొత్తపట్నం 18.2, టంగుటూరు 18, దోర్నాల 17.8, పెద్దారవీడు 17.6, కనిగిరి 17.2, బేస్తవారిపేట 16, ఎన్‌జీపాడు 15.6, పీసీపల్లి, కంభం 15.4, గిద్దలూరు 13, కొమరోలు 11, వెలిగండ్ల 11.7, రాచర్ల 10.6, అర్ధవీడు 10, సీఎస్‌పురం 8.6 మి.మీలుగా నమోదైంది.



నాగులుప్పలపాడు మండలంలో వర్షానికి నీటమునిగిన పొగాకు పంట



మద్దిపాడు మండలంలో మిర్చి చేలో చేరిన నీరు



కంభంలో నేలకొరిగిన అరటిచెట్లను చూపుతున్న రైతు



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

38,483 ఎకరాల్లో పంట నష్టం

ఒంగోలు సెంట్రల్: జిల్లా వ్యాప్తంగా 38,483 ఎకరాల్లో వివిధ దశల్లో ఉన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా గుర్తించామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. పొగాకు పంటకు సైతం నష్టం వాటిల్లింది. వరి 5,478 ఎకరాలు, సజ్జ 798 ఎకరాలు, కంది 311 ఎకరాలు, మినుము 3,399, పొగాకు 20,499, నువ్వులు 128 ఎకరాలు, శనగ 7761, పెసర 35, ఉలవలు 7, జొన్న పంట 67 ఎకరాల్లో నష్టపోయినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు చెప్పారు. అలాగే వరి, పత్తి, వేరుశనగ, పప్పుశనగ, కంది, మినుము, పెసర, చిరుధాన్యాలకు సంబంధించి వర్షం తగ్గిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

ఒంగోలు అర్బన్: మిచాంగ్ తుఫాన్ బాధితులను అన్నీ రకాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారి పీఎస్ ప్రద్యుమ్న స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌తో కలిసి మంత్రి, ప్రత్యేక అధికారి తుఫాన్ ప్రభావంపై జిల్లాలో చేపడుతున్న చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో మంత్రి సురేష్ మాట్లాడుతూ తుఫాన్ బాధితులకు ప్రభుత్వం తోడుగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని సూచించారు. తుఫాన్ వల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ, విద్యుత్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, సివిల్ సప్లయిస్, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాధితులకు, తుఫాన్ పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి సంతృప్తికరమైన సేవలు అందించాలన్నారు. తుఫాన్ ప్రభావం తగ్గిన తర్వాత పంట నష్టం అంచనా వేస్తామన్నారు. నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. ఏ సీజన్‌లో నష్టపోయిన పంటకు అదే సీజన్‌లో పరిహారాన్ని ముఖ్యమంత్రి అందిస్తున్నట్లు తెలిపారు.

ప్రత్యేక అధికారి ప్రద్యుమ్న మాట్లాడుతూ జిల్లాలోని పరిస్థితులను బట్టి అవసరమైన చర్యలు జిల్లా యంత్రాంగం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి నుంచి వివరాలు తెలుసుకుంటున్నామన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు ముందుగానే తరలించినట్లు తెలిపారు. ప్రజలు కూడా అధికార యంత్రాంగం సూచనలు పాటించి సహకరించాలన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, పక్కన కలెక్టర్, ఎస్పీ

కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు సెలవులు రద్దు చేసి యంత్రాంగం మొత్తం పూర్తి స్థాయిలో సహాయ, పునరావాస చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. తీరప్రాంత మండలాలతో పాటు సరిహద్దు మండలాల ప్రజలను కూడా అప్రమత్తం చేశామన్నారు. పూరిళ్లు, ప్రమాదకర స్థితిలో ఉన్న పురాతన ఇళ్లలో ఉంటున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. కేంద్రాల్లో భోజనం, తాగునీరు, ఔషధాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రతి శిబిరానికి డిప్యూటీ తహశీల్దార్, ఈఓపీఆర్‌డీ స్థాయి అధికారులను ఇన్‌చార్జులుగా నియమించినట్లు తెలిపారు. మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి సహాయ, పునరావాస కార్యక్రమాలను జిల్లా కేంద్రం నుంచి పర్యవేక్షిస్తున్నామన్నారు. 24 గంటలు పనిచేసేలా కలెక్టరేట్‌తో పాటు ఎస్పీ కార్యాలయంలో కంట్రోలు రూములు ఏర్పాటు చేశామని చెప్పారు.

ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ పోలీసు శాఖ తరఫున తీసుకుంటున్న చర్యలను వివరించారు. రోడ్లపై చెట్లు కూలితే తొలగించేందుకు అవసరమైన పరికరాలతో పోలీసు, మెరైన్, ఆర్అండ్‌బీ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచామన్నారు. తీరప్రాంతం, వాగులు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పికెట్స్, బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశం అనంతరం మంగమూరు రోడ్డులోని సత్యసాయి స్కూల్‌లో ఏర్పాటు చేసిన తుఫాన్ పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు. అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. అక్కడి నుంచి కొత్తపట్నం మండలంలోని పల్లెపాలెం సచివాలయం, రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ప్రద్యుమ్న, కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. అదేవిధంగా సముద్ర తీర ప్రాంతాన్ని పరిశీలించి సముద్ర అల్లకల్లోలంగా ఉన్నందున తీరప్రాంతం వద్దకు ప్రజలను రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట ఆర్డీవో విశ్వేశ్వరరావు సంబంధిత జిల్లా అధికారులు ఉన్నారు.


పాకల తీరంలో అలల ఉధృతి


చీమకుర్తి-కేవీ పాలెంలో చెరువును తలపిస్తున్న వరి మాగాణి


చీమకుర్తి : నేలకొరిగిన కంది పంట

'జడి'పించిన మిచాంగ్

ఎడితెరపి లేని వర్షం.. పెనుగాలులతో మిచాంగ్ తుఫాన్ జిల్లాపై విరుచుకుపడింది. తుఫాన్ దిశ మార్చుకుంటూ ప్రయాణిస్తుండటంతో ఓ దశలో జిల్లాలో తీరం దాటే అవకాశముందని భావించిన అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. చివరకు బాపట్ల జిల్లాలో తీరం దాటడంతో జిల్లా వాసులతోపాటు సహాయక చర్యల్లో పాల్గొన్న అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. తుఫాన్ ప్రభావంతో వీచిన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు, భారీ చెట్లు నేలకొరిగాయి. పలు ప్రాంతాల్లో వాగులు పొంగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పంట చేలను వర్షం నీరు ముంచెత్తింది. కోత దశలో ఉన్న వరి, పూత దశలో ఉన్న కంది పంటతోపాటు మినుము, మిరప, మొక్కజొన్న, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇదిలా ఉండగా తీర ప్రాంత మండలాల్లో సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి భోజనం, మందులు సమకూర్చారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు ఆ శాఖ అధికారులు, సిబ్బంది శ్రమిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


త్రిపురాంతకం : విశ్వనాథపురంలో కోత దశలో దెబ్బతిన్న వరి


చీమకుర్తి : దెబ్బతిన్న మొక్కజొన్న


కొండేపల్లిలో దెబ్బతిన్న వరి పైరును పరిశీలిస్తున్న ఏడీఏ రమాదేవి


ఇనమనమెళ్లూరులో నీటమునిగిన పొగాకు


ఊళ్లపాలెం తీరంలో బోట్లను జాగ్రత్త చేసుకుంటున్న మత్స్యకారులు


కనిగిరిలో విద్యుత్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్


ఒంగోలు : సౌత్ బైపాస్‌లో డ్రెయినేజీ తవ్విస్తున్న మేయర్ గంగాడ సుజాత


మంగమూరు రోడ్డులోని పునరావాస కేంద్రంలో మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది


చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో ఇంటిపై కూలిన చెట్టు


కనిగిరిలో కూలిన పొగాకు బ్యార్న్


కొనకనమిట్ల : కర్నూలు హైవేపై బ్రాహ్మణపల్లి వద్ద కూలిన చెట్టు


కురిచేడు : గంగదొనకొండలో కూలిన చెట్టు తొలగింపు


ఆలకూరపాడు పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న స్పెషల్ కలెక్టర్ సువర్ణమ్మ


ఒంగోలు : మంగమూరు రోడ్డులోని పునరావాస కేంద్రంలో బిస్కెట్లు పంపిణీ

స్తంభించిన జనజీవనం!

- తుఫాన్ దెబ్బకు గడప దాటని జనం
- ప్రయాణికులు లేక 40 శాతం బస్సులు రద్దు
- చెన్నై మార్గంలోనూ బస్సుల రాకపోకలకు ఆటంకం

ఒంగోలు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో జడి వాన కురవడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. తుఫాన్ తీరం దాటుతున్న సందర్భంగా వాతావరణశాఖతోపాటు ప్రభుత్వం ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తుండటంతో చాలా మంది ప్రయాణాలు వాయిదా వేసుకున్నారు. ఒక్కో బస్సులో పట్టుమని పది మంది కూడా ఎక్కకపోతుండటంతో ఆర్టీసీ అధికారులు దాదాపు 40 శాతం బస్సులను రద్దు చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి రూట్‌లో బస్సులను నామమాత్రంగా తిప్పారు. కొన్ని మార్గాల్లో చెట్లు విరిగిపడినా ఆ ప్రభావం పాక్షికమేనని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. దుద్దుకూరు, వంకాయలపాడు వద్ద వాగులు పొంగి పొర్లడంతో ఆ మార్గంలో బస్సులను రద్దుచేయక తప్పలేదు. అయితే ఇంకొల్లులో ఆగిపోయిన బస్సులను జె.పంగులూరు మీదుగా ఒంగోలు డిపోకు తీసుకువచ్చారు. చెన్నై మార్గంలో జాతీయ రహదారిపై నీరు పొంగి పొర్లుతుండటంతో మంగళవారం రాత్రి చెన్నై వెళ్లాల్సిన బస్సులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

భూ సంరక్షణతోనే భావితరాలకు మనుగడ

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ఒంగోలు సెంట్రల్: మానవునికి మట్టికి అత్యంత అవినాభావ సంబంధం ఉందని, భూ సంరక్షణతోనే భావితరాల మనుగడ సాధ్యమని జిల్లా వ్యయసాయశాఖాధికారి ఎస్ శ్రీనివాస రావు అన్నారు. మంగళవారం ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా వెంగముక్కపాలెంలో రైతులకు నేల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో 70 శాతం మంంది ప్రజలు నేలను నమ్ముకునే జీవనం సాగిస్తున్నారని అన్నారు. భావితరాల కోసం నేల తల్లిని కాపాడుకోవాల్సిన ఆవశ్యతకను వక్తలు వివరించారు. ఒంగోలు ఏడీఏ రమేష్‌బాబు, సాయిల్ టెస్టింగ్ ఏడీఏ సుచరిత తదతరులు పాల్గొని నేల సారవంతం కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను, నేలలో పోషకాలను బట్టి ఇవ్వాల్సిన పోషకాలను గురించి తెలిపారు.

లారీ ఢీకొని ఇద్దరు దుర్మరణం

- కీసరలో బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం
- మృతులది హనుమంతునిపాడు మండలం వేములపాడు


త్రినాథ్(ఫైల్)


కోటయ్య(ఫైల్)


ఘటనా స్థలంలో త్రినాథ్, కోటయ్య మృతదేహాలు

కీసర: లారీ, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటన మంగళవారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని చీర్యాల చౌరస్తా సమీపంలో చోటుచేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమంతునిపాడు మండలం వేములపాడు గ్రామానికి చెందిన త్రినాథ్(48), కోటయ్య(37)లు ఏడేళ్ల క్రితం చీర్యాల గ్రామానికి వలస వచ్చి తాపీ మేస్త్రీలుగా పనిచేస్తున్నారు. త్రినాథ్ భార్యాపిల్లలతో చీర్యాలలో నివసిస్తుండగా, కోటయ్య దమ్మాయిగూడలో నివసిస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఇద్దరూ కలిసి బైక్‌పై కీసరలో భవన నిర్మాణ పనికివెళ్లారు. వర్షం కారణంగా పనిదొరక్కపోవడంతో తిరిగి ఇంటికి వెళ్తుండగా చీర్యాల చౌరస్తాలో ఎదురుగా వచ్చిన లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరి తలలకు బలమైన గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడు కోటయ్యకు ముగ్గురు ఆడపిల్లలు కాగా, త్రినాథ్‌కు ఇద్దరు పిల్లలున్నారు. సంఘటన స్థలంలో కుటుంబీకుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిద్రలోనే అనంత లోకాలకు..

- నల్గొండ వద్ద ట్రావెల్ బస్సు ప్రమాదంలో యువకుడు సజీవ దహనం
- ఒంగోలులోని గద్దలగుంటకు చెందిన తోట చైతన్యగా గుర్తింపు


తోట చైతన్య(ఫైల్)

ఒంగోలు సబర్బన్: తెలంగాణ రాష్ట్రం నల్గొండ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైన ఘటనలో సజీవ దహనమైన యువకుడిని ఒంగోలు వాసిగా గుర్తించారు. ఒంగోలు నగరంలోని గద్దలగుంటకు చెందిన తోట చైతన్య(19) గాఢ నిద్రలో అగ్ని కీలలకు బలైనట్లు తెలియడంతో తల్లిదండ్రులు, బంధు మిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. అందిన సమాచారం మేరకు.. ఒంగోలు నగరంలోని గద్దలగుంటకు చెందిన తోట సుధీర్, శైలజ రెండో కుమారుడు చైతన్య(19) గుంటూరులోని ఒక ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ల్యాప్‌టాప్ పనిమీద శనివారం హైదరాబాద్ వెళ్లి ఆదివారం ఓ ప్రైవేటు ఏసీ బస్సులో తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో నల్గొండ వద్ద బస్సులో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. ప్రయాణికులు హడావుడిగా కిందకు దిగారు. గాఢ నిద్రలో ఉన్న చైతన్యను ఎవరూ పట్టించుకోకపోవడంతో సజీవ దహనమయ్యాడు. బస్సు ప్రమాదం గురించి ఆరా తీసిన స్నేహితులు.. సజీవ దహనమైంది తమ మిత్రుడు చైతన్యేనని నిర్ధారించుకున్నారు. కాగా, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు సిబ్బంది నిర్లక్ష్యం వల్లే చైతన్య మృతి చెందాడని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. చైతన్య తండ్రి ఒంగోలులోని పెట్రోలు బంకులో పనిచేస్తుండగా, తల్లి ఇంటి వద్దే మిషన్ కుడుతూ కుటుంబానికి చేదోడుగా ఉంటోంది. చైతన్య తండ్రి స్వగ్రామం నాగులుప్పలపాడు మండలం కనపర్తి సమీపంలోని దాసరివారిపాలెం. చైతన్య మృతదేహానికి మంగళవారం సాయంత్రం ఒంగోలు కమ్మపాలెం శ్మశానంలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

పునరావాస కేంద్రాల పరిశీలన


కొత్తపట్నం : కె.పల్లెపాలెంలోని పునరావాస కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ ప్రద్యుమ్న, పక్కన కలెక్టర్, ఎస్పీ

కొత్తపట్నం: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో మండలంలో లోతట్టు ప్రాంతాల్లో నివిస్తున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. మంగళవారం సముద్రం రోడ్డును తాకి బోట్లుకు, వలలకు నష్టం కలిగించింది. తీరం వెంబడి కోతకు గురైంది. కొత్తపట్నం బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కె.పల్లెపాలెం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ సెంటర్లలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాలను మంగళవారం జిల్లా ప్రత్యేకాధికారి ప్రద్యుమ్న, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, ఆర్డీఓ విశ్వేశ్వరరావు పరిశీలించారు. పునరావాస కేంద్రంలో వసతులపై ఆరా తీశారు. అక్కడే ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీచ్ ప్రాంతానికి వెళ్లి బోట్లు, వలలు పరిశీలించారు. అలలు ఉధృతంగా ఉన్నాయని బోట్లు, వలలు సురక్షిత ప్రాంతానికి తరలించాలని మత్స్యకారులకు సూచించారు. తీరం వెంబడి ఎవ్వరూ నివాసం ఉండవద్దని, ఇక్కడ ఎవ్వరూ తిరగవద్దన్నారు. తుఫాన్ తీరం దాటిన తర్వాత రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని, మత్స్యకారులు ఎవ్వరూ వేటకు వెళ్లవద్దని సూచించారు. ఏదైనా ఆపద వస్తే వెంటనే తమకు తెలియజేయాలని సర్పంచ్ ఆనందరావుకు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీఓ పి.సుజాత, డీఎస్పీ వెంకటస్వామి, సీఐ జగదీశ్, ఎస్సై సాంబశివరావు, వెంకటేశ్వర్లు, ఎఫ్‌డీఓ ఆషా, ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువుల రిలీఫ్ కేంద్రం సందర్శన


గోవుకు దాణ తినిపిస్తున్న మంత్రి సురేష్, పక్కన కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు సెంట్రల్: తుఫాన్ సందర్భంగా ముంగమూరు రోడ్‌లో ఏర్పాటు చేసిన పశు రీ హ్యాబిటేషన్ సెంటర్‌ను మంగళవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా ప్రత్యేకాధికారి పీఎస్ ప్రద్యుమ్న, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్‌లు సందర్శించారు. ఆవుల యజమానులకు జిల్లా పశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ బేబీరాణి ఆధ్వర్యంలో మూడు టన్నుల ఎండు మేత, 500 కేజీల పశువుల దాణాను ఉచితంగా పంపిణీ చేశారు. ఆవులకు ప్రేమతో దాణ తినిపించారు. డీఎల్‌డీఏ కార్యనిర్వాణాధికారి డాక్టర్ కాలేషా, పశువైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.